ఆమె ఆ బిల్ మీద వున్న తేదీ చూసింది.

హోటల్ బిల్ మీద వున్న తేదీ కూడా అదే. ఆగస్టు....12...

సరిగ్గా నెలక్రితం పన్నెండో తారీఖు ఈ ఊళ్ళోనే... అతడా హోటల్లో వున్నట్టు బిల్లు!

అతడు క్రితం నెల బ్రాంచి ఆఫీసుకి వెళ్ళిన రోజు అది!!

మధ్యాహ్నం రెండింటికి విష్ణు వచ్చాడు. ట్రెయిన్‌కి ఇంకో అరగంటే టైమ్ వుండటంతో హడావుడిగా "బ్రీఫ్ కేస్ సర్దావా?" అని అడిగాడు.

ఆమె తలూపింది. అతడు తెరిచి చూశాడు. రైల్లో తిరుగు ప్రయాణానికి పెట్టిన జత తీసి లోపల పెట్టేసి, మరో మంచి జత బట్టలు లోపల పెట్టుకున్నాడు.

ఆమె అతడి కోసం కాఫీ తయారు చేసి తీసుకొస్తూండగా, పెర్‌ఫ్యూమ్ బాటిల్ బ్రీఫ్‌కేస్‌లో పెట్టుకోవటం కనిపించింది.

అయిదు నిముషాల్లో అతడు తయారై వెళ్ళిపోయాడు. వెళ్తూ వెళ్తూ 'ఎల్లుండి ప్రొద్దున్న వస్తానని' చెప్పాడు. ఆమె తలూపింది. అతడు వెళ్ళాక కళ్ళముందు ఒకే వాక్యం కదలాడుతోంది.

గార్డెన్ వరేలీ. మూడొందల యాభై రూపాయలు.

సాయంత్రమయ్యాక ఆమె ఇల్లు తాళం వేసి బయటకొచ్చింది. సెప్టెంబర్ మాసమవటంతో కొద్ది కొద్దిగా చలి అప్పుడే ప్రారంభమయింది.

ఆమె హోటల్ దాశప్రకాశ్‌కి చేరుకునేసరికి బాగా చీకటి పడింది లోపలికి ప్రవేశించింది. రిసెప్షన్ పక్కనే విశాలమైన వరండా చివర షాపు రష్‌గా వుంది. 'ఇంటాక్సికేషన్స్.'

ఆమె రిసెప్షనిస్ట్ దగ్గిర చూసి "ఎమ్వీ మూర్తి రూమ్ నెంబర్ చెప్తారా?" అని అడిగింది రిసెప్షనిస్టుని చిరునవ్వుతో.

ఆమె రికార్డ్ చూసి "రూమ్ నెంబర్ 314" అంది.

"ఎప్పుడొచ్చారో చెప్పగలరా మాడమ్?" అని అడిగింది.

"ఈ రోజు మధ్యాహ్నం"

లక్ష్మి లిఫ్ట్ దగ్గరకివెళ్ళి "థర్డ్ఫ్లోర్" అని చెప్పింది.

రెండు నిముషాల తరువాత లిఫ్ట్ మూడో అంతస్థులో ఆగింది. విశాలమైన వరండా.

310....311.....312....313.....314..

ఆమె ఆగింది. గది ముందు నిలబడి గాఢంగా లోపలికి ఒకసారి శ్వాస పీల్చుకుని కాలింగ్బెల్మీద వేలు ఆన్చి నొక్కింది.

లోపల బెల్ మ్రోగుతున్న శబ్దం.

ఎవరో తలుపు దగ్గరకి వస్తున్న అలికిడి.

తలుపు నెమ్మదిగా తెరుచుకుంటూండగా ఆమె కళ్ళు మూసుకుంది.

ఎందుకో తెలీదు కళ్ళు మూసుకుంది.

అలా ఎంతసేపుందో తెలీదు క్షణమో---- నిముషమో - కళ్ళు తెరిచేసరికి తననే చూస్తూ ఎదురుగా విష్ణు వున్నాడు. అప్పటివరకూ కళ్ళు మూసుకుని వుండటంవలన, తనని చూడగానే అతడి ఫీలింగ్ ఏమిటో తెలియలేదు.

అతడు తలుపు తెరిచి, అడుగు వెనక్కి వేసి ‘కమిన్’ అన్నాడు. క్షణంపాటు అతడేం చెప్పాడో అర్థం కాక ఆమె బ్లాంక్‌గా చూసింది.

అతడు మళ్ళీ “కమిన్--” అన్నాడు లోపలికి నడుస్తూ- ఆమె అప్రయత్నంగా అతడిని అనుసరించింది.

సోడాలింకా ఓపెన్ చేయలేదు. వాటితోపాటు బల్లమీద లిమ్కా, జిన్ వున్నాయి. సెంట్రల్లీ ఎయిర్- కండిషన్ అవటం వల్ల శబ్దం లేకపోయినా గది చల్లగా వుంది. ఛానల్ టి.వి.లో సన్నగా పాట వస్తోంది.

బాత్‌రూమ్ పక్కనుంచి దారి. ఆ తరువాత విశాలమైన హాలు, హాల్లో- సోఫాలో కూర్చుని వుంది ఆమె. వయసు పాతిక వుంటుంది. ఆధునికంగా వుంది.

“నా భార్య లక్ష్మి” అంటూ ఆమెకి పరిచయం చేశాడు.

## 3

ఆ అమ్మాయికి విష్ణు చెపుతూన్నది మొదట అర్థం కాలేదు. అర్థమవగానే అదిరిపడి చూసింది.

లక్ష్మి పరిస్థితి కూడా అలాగే వుంది.

అతడు గ్లాసుల్లోకి విస్కీ వంపుతూ “...కూర్చో” అనగానే అసంకల్పితంగానే కూర్చుంది. అతడు అవసరమైనదానికన్నా ఎక్కువ ఏకాగ్రతతో డ్రింక్ కలిపి, ఒక గ్లాసు ఎదురుగా వున్న అమ్మాయికి అందించి, “బైదిబై - ఈమె సుచరిత. మా ఆఫీసే” అన్నాడు.

లక్ష్మి తలెత్తలేదు. కనీసం విష్ చేసే ఓపిక కూడా లేనట్టు అచేతనంగా వుండిపోయింది.

ఆ గదిలో నిశ్శబ్దం ఎంత భయంకరంగా వుందంటే, ఇప్పుడు ఎయిర్ కండిషనర్ శబ్దం కూడా స్పష్టంగా వినిపిస్తోంది.

విష్ణు కాళ్ళు రెండూ టేబిల్ క్రిందున్న చెక్కమీద ఆన్చి 'సిప్' చేస్తున్నాడు.

లక్ష్మికి తనక్కడికి ఎందుకొచ్చిందో, ఏం సాధించాలని వచ్చిందో తెలియలేదు. పునరాలోచించుకుంటే, తను ఎంత నిరర్థకమైన పని చేసిందో అర్థమైంది.

అక్కడనుంచి లేచి వెళ్ళిపోదామనుకుంటుండగా సుచరిత జనాంతికంగా "నేను బయట సిటౌట్‌లో కూర్చుంటాను" అని ముందు గదిలోకి వెళ్ళింది.

"ఇదిగో, ఇది తీసుకువెళ్ళు" అంటూ విష్ణు లేచి, గ్లాసుతో బయటికి నడిచి, ఆమెకు దాన్ని అందించి లోపలికి వచ్చాడు.

వస్తూ వస్తూ పార్టిషన్ తలుపు దగ్గిరగా వేశాడు.

"ఊఁ.... ఇప్పుడు చెప్పు"

ఆమె మాట్లాడలేదు.

అతనే అన్నాడు. "ఇంకెవరైనా ఈ పరిస్థితిలో వుంటే ఏం చేసేవారో తెలుసా? చెంప బ్రద్దలు కొట్టేవారు. పై అంతస్థు మీద నుంచి క్రిందకు తోసేసేవారు!! ఏమిటి? నామీద పత్తేదారు పని చేయటానికీ, నేను ఎక్కడికి వెళ్తున్నానో కనుక్కోవటానికీ నావెనుకే ఫాలో అయ్యావా? నేనీక్షణం నీ వళ్ళు చీరెయ్యకుండా వున్నానంటే కేవలం నా మంచితనమే కారణం! తెలుసా అది నీకు?".

ఆమె తలవంచుకుని తన చేతి గోర్ల వంక చూస్తూ కూర్చుంది. అతడు చేసిన తప్పుకు తను అతన్ని నిలదీయాలో తనని అతడు దండిస్తున్నాడో తెలియని అయోమయంలో పడిందామె.

సుచరిత గదిలో వున్నప్పుడు అతడిలో కనిపించిన "కామ్‌నెస్" ఇప్పుడు లేదు.

అతడి మొహం జేవురించి వుంది. మనిషి చాలా ఇరిటేటింగ్‌గా, విసుగ్గా, కోపంగా వున్నాడు.

అది ఒక హోటల్ రూమ్ కాబట్టీ, బయట ఒక అమ్మాయి కూర్చుని వుంది కాబట్టీ అక్కడో సీన్ క్రియేట్ చేయకుండా వుండటం కోసం, అతికష్టంమీద తనని తాను కంట్రోల్ చేసుకుంటున్నట్టు వున్నాడు.

అందులో చిత్రమేమీ లేదు.

చిత్రం ఎక్కడుందటే....

అదంతా తన మంచితనంగా అతను ప్రొజెక్ట్ చేసుకుంటున్నాడు. ఆమెని డిఫెన్స్‌లో పడేశాడు. అదీ వింత!

లక్ష్మి దాన్ని అర్థం చేసుకున్నదా? తన చిన్న తప్పుని అంత పెద్దది చేసి దాని నీడలో అతని పెద్ద తప్పుని కప్పి పుచ్చుకుంటున్నాడు.

ఇది అర్థం కానంత పెద్ద విషయమేమీ కాదు.

వాదించి గెలవొచ్చు.

కానీ అలా వాదించాలంటే ఇద్దరూ సమ ఉజ్జీలైన న్యాయవాదులై వుండాలి !

ఒకరు 'ఆధారపడే' బలహీనత వున్న 'స్త్రీ' అయివుండకూడదు. వాదించి, గెలిచి--ఓడిపోవాలి. స్వంత కాళ్ళమీద నిలబడే శక్తి సమకూర్చుకోవాలి.

"వెళ్ళు" అన్నాడు అతడు. అతను కదల్లేదు. కదలక పోవటానికి కారణం కాళ్ళల్లో శక్తి లేకపోవటం!

అతడు కుర్చీలోంచి లేచి దగ్గరగా వచ్చాడు. "...ఇంకెప్పుడూ ఇలాటి పనులు చేయకు. మిగతా విషయాలు ఇంటికొచ్చి మాట్లాడతాను. క్రింది లాంజ్‌లోనే ఏదో ఒక వెహికల్ దొరక్కపోదు. జాగ్రత్తగా వెళ్ళు--".

ఆమె లేచింది. తలవంచుకుని బయటకు నడిచింది. ముందు గదిలో కూర్చుని వున్న సుచరిత ఆమెని చూసి లేచి నిలబడింది. విష్ణు లోపలే వుండిపోయాడు.

లక్ష్మి సుచరిత వైపు చూడలేదు. తలవొంచుకుని బయటకు నడిచింది.

విశాలమైన వంటరి వరండా! లిఫ్ట్ కుర్రాడు 'గ్రౌండ్ ఫ్లోర్ మాడమ్' అన్నాడు. ఆమె నిశ్శబ్దంగా లిఫ్ట్ బయటకు నడిచింది. ఆటోకోసం గానీ రిక్షా కోసం గానీ చూడలేదు.

నడవటం ప్రారంభించింది!

ఏ వాహనం ఎక్కినా ఇల్లెక్కడో చెప్పాలంటే మా..ట్లా.....డా.......లి!

గుండెల నిశ్శబ్దాన్ని చెదర్చాలి.

అది ఇష్టం లేనట్టు ఆమె మౌనంతో పయనించింది.

ఇంటికి చేరుకునేసరికి తొమ్మిది దాటింది. అప్పటివరకూ వున్న ఓపిక ఇల్లు చేరుకోగానే పోయింది. నిస్సత్తువగా హాల్లోనే కూర్చుండిపోయింది. ఆమెకు దుఃఖం రాలేదు. రెండు బొటన వేళ్ళతో మెదడుని నొక్కి పట్టిన భావన. మనసు నల్లటి గుడ్డలో పెట్టి పిండుతున్నట్టు-స్థబ్దత! అలాగే కూర్చుని వుండిపోయింది. ఆమె పక్కనుంచి పిల్లి ఒకటి లోపలికి వెళ్ళి వంటింట్లో పాలగిన్నెని పడేసింది. ఆమె లేవలేదు. ఫస్ట్‌షో వదిలారో సెకెండ్‌షో వదిలారో తెలీదు.

ఎంత టైమైందో తెలీదు.

కానీ అదే వీధిలో సినిమా హాల్లోంచి జనం బయటకు వస్తున్నారు. పావుగంటలో ఆ కలకలం కూడా సద్దుమణిగింది. దూరంగా ఎవడో కుర్రాడు సైకిల్‌మీద వెళ్తూ గట్టిగా పాడుతున్నాడు "... మాధవా ... జాగేలరా"

కల్యాణిరాగం. దానికీ బీతోవెన్‌కి దగ్గిర సంబంధం వున్నదేమో. బీతోవెన్ గుర్తొచ్చేసరికి ఆమె ఇక ఆగలేకపోయింది. ఒక సంఘటన ద్వారా మనసు గాఢంగా దెబ్బ తిన్నప్పుడు మరొకరిని ఆశ్రయించి సాంత్వన పొందడం సహజం.

ఆమె చేతివేళ్ళు అప్రయత్నంగా డయల్ చేశాయి. అట్నుంచి ప్రహసిత్ "హల్లో" అన్నాడు.

భర్త అన్నట్టు డిటెక్టివ్ పనిచేసి అతడిని రెడ్‌హేండెడ్‌గా పట్టుకోవటమే ఒక అనాలోచితమైన చర్య అయితే, ఇప్పుడీ అర్థరాత్రి ఇలా ఇంకొకరికి ఫోన్ చేయటం....

ఆమె చెయ్యి వణికింది.

ఈలోపులో అవతల్నుంచి ..నేను నీ శ్వాసనే గుర్తుపట్టగలను అన్నట్టుగా "లక్ష్మి.....హల్లో....లక్ష్మి" అంటున్నాడు ప్రహసిత్.

ఆమె నెమ్మదిగా రిసీవర్ పెట్టేసింది.

సూర్యుడు అస్తమిస్తున్న సమయంలో చుట్టూవున్న నాలుగు గోడలూ కమలం ముడుచుకుపోతున్నట్టు నెమ్మదిగా ముడుచుకుపోయి తనని కప్పేస్తున్న అనుభూతి.

గర్భస్థ శిశువు చుట్టూ పేరుకున్న నిశ్శబ్దం తన చుట్టూ కమ్ముకుంటున్నట్టు ఆమె మోకాళ్ళమీద వంగి ఆ నిశ్శబ్దంలో వొదిగిపోయింది.

అలా ఎంతసేపు కూర్చుండిపోయిందో గుర్తులేదు.

బయట కాలింగ్‌బెల్ మ్రోగింది. ఆమె ఉలిక్కిపడింది.

ఆమె ఎంత డిఫెన్సివ్ మూడ్‌లో వుందంటే తను చేసిన పనికి భర్త మనసు పాడయి తిరిగి వచ్చేశాడేమో, తనని ఎంత తిడతాడో అని భయపడింది.

అయితే వచ్చింది ప్రహసిత్.

ఆమెని చూడగానే అప్పటివరకు టెన్షన్‌తో వున్న అతడి మొహంలో రిలాక్సేషన్ కనపడింది "హమ్మయ్య, మీరు క్షేమంగానే వున్నారు కదా--" అన్నాడు.

ఆమె అతడి రాకని వూహించకపోవటంతో బిత్తరపోయి చూస్తోంది.

"...అలా ఫోన్ పెట్టేసరికి ఎవరైనా దొంగలు ప్రవేశించారేమో, మీరు ప్రమాదంలో వున్నారేమో అనుకున్నాను. వందకిలోమీటర్ల స్పీడ్‌లో వచ్చాను" .

అంత చలిలో అతడి నుదుటిమీద చెమటే ఆ విషయం చెపుతోంది.

"ఎందుకింత రాత్రి ఫోన్ చేశారు?"

ఆమె సమాధానం చెప్పలేదు. అప్రయత్నంగా అడుగు వెనక్కి వేసింది. అతడు లోపలికి వచ్చాడు "ఆయన లేరా?"

అతడిని లోపలికి పిల్చి కూర్చోపెట్టాలో, అక్కడనుంచి అలాగే పంపించాలో తెలియని అయోమయంలో వున్న లక్ష్మి ఆ మాటలకి కూడా సమాధానం చెప్పలేదు.

అతడు ఆమె డోలాయమాన పరిస్థితిని వేరేవిధంగా అర్థం చేసుకుని "ఏమైంది లక్ష్మీ? ఎనీథింగ్ రాంగ్?" అని అడిగాడు. అప్పుడొచ్చింది ఆమెకు దుఃఖం. వెక్కివెక్కి ఏడవటం ప్రారంభించింది.

ఒక్కసారిగా ఆమె ఇలా దుఃఖించటం ప్రారంభించేసరికి అతడు కంగారు పడ్డాడు. "ఏమైంది? ప్లీజ్ చెప్పండి. మీవారు బాగానే వున్నారు కదా. ఆరోగ్యం సరిగానే వుందిగా. ఆఫీసులో ఏదైనా ప్రాబ్లెమ్ వచ్చిందా? మీరలా ఏడవకండి. చెప్పండి. దేన్నయినా పరిష్కరించవచ్చు. నేనుండగా ఏమీ కాదు. అసలు విషయం చెప్పండి" అనునయంగా అన్నాడు.

ఆమె కొద్ది సేపటికి తేరుకుంది. కన్నీళ్ళు తుడుచుకుంటూ.... "ఏమీ లేదు" అంది.

ఆమె పరిస్థితి అర్థమైనట్టు అతడు కూడా కొంచెంసేపు మౌనంగా వుండిపోయాడు.

తరువాత కదుల్తూ "మీకు ఒంటరిగా వుండటం భయమైతే ఎవరైనా పని అమ్మాయిని పంపుతాను" అన్నాడు. అవసరం లేనట్టు ఆమె తల అడ్డంగా వూపింది.

“వెళ్ళొస్తాను” అంటూ  అతడు గుమ్మం వైపు కదిలాడు. తను అప్పటి వరకు ఒక్కమాట కూడా మాట్లాడలేదనీ, అంత దూరం నుంచి వచ్చినవాడిని కనీసం పలకరించలేదనీ కూడా ఆమెకు గుర్తొచ్చింది.  “ప్రహసిత్” అంది.

అతడు ఆగాడు.
ఆ తరువాత ఏమి మాట్లాడాలో  ఆమెకు అర్థం కాలేదు.

“మీరు ...ఆ సాహితీ సభలో.....గాయంవల్ల టెన్నిస్‌కి పనికిరారని.. పేపర్ల..... సారీ ..నేనూ...”

అతడు దగ్గిరకొచ్చాడు.. చాలా దగ్గరికి....

“ఇందుకు బాధపడుతున్నారా మీరు?” అన్నాడు సాంత్వనగా. అర్థరాత్రి అది గుర్తొచ్చి ఆమె రోదిస్తోంది  అనుకున్నాడు.  “చూడండి... నేనారోజు మినిస్టర్‌ని ఎదుర్కొన్నానంటే  అది కేవలం నా కోసం! నా ఆవేశం అణుచుకోలేక అతన్ని కొట్టాను.  దాని ఫలితం ఇది.  దీని గురించి మీరేమీ బాధపడకండి. అసలు నాగురించి మీరేమీ ఆలోచించకండి.  నేనిక మిమ్మల్ని కలుసుకోకూడదనే అనుకున్నాను. ఈ ఫోన్‌కాల్ నన్ను అయోమయంలో పడేసింది. ఐ యామ్ సారీ!” అని తిరిగి వెనుదిరిగి, గుమ్మం  దగ్గిర ఆగి మళ్ళీ అన్నాడు.  “నేనెంత తప్పుచేశానో నాకు అర్థమవుతోంది. ఇదంతా నా అనాలోచిత చర్య. దీనివల్ల మిమ్మల్ని తద్వారా మీ కుటుంబాన్నీ కలత పెట్టాను. నా గురించి పూర్తిగా మర్చిపోండి” అని, ఆమె జవాబు ఆశించకుండా అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

తను జీవితంలో ఇక ఎవర్నీ ప్రేమించ(లే)నని గానీ, తన ప్రేమ గురించిగానీ, అతడొక్క మాట మాట్లాడలేదు.  అలా మాట్లాడితే, భవిష్యత్తులో ఆమె దాని గురించి ఆలోచిస్తూ తన భర్తకీ, తన సంసారానికీ న్యాయం చేకూర్చలేదేమో అన్న భావం అతడిని ఆ విధంగా  మాట్లాడకుండా చేసింది.

తనెలా పోయినా ఫర్వాలేదు... తన స్నేహితురాలు సుఖంగా వుండాలన్నది అతడి అభిప్రాయం.
అతడి అభిప్రాయం ఎంత వరకు నిజమవుతుందో కాలమే నిర్ణయించాలి!